కవిపత్ని

విశారద శ్రీ॥ తి॥ పి॥ రంగాచార్యులుగారు

విద్యార్థి అవస్థలో నేనూ మణిభద్రుడూ సహాధ్యాయులం. ఇంతేకాదు. ప్రాణస్నేహితులం. ఒక కంచంతిండి; ఒకమంచంపడక. ఒకర్ని ఒకరం చూడకుండా ఉన్నంతకాలం క్షణం ఒకయుగంలా వెళ్లించేవాళ్లం. కాని చిత్రం ఏమంటే—

కొన్నాళ్ల కా ప్రేమపాశం పుటుక్కున తెగి, విరోధంఅనే చెల్లెలి కట్ట ఏర్పడింది మాస్నేహప్రవాహానికి. మా యిద్దరిమధ్యనూ గర్భశత్రుత్వం నిలిచిపోయింది. ఎఫ్. ఎ. పరీక్షలో ఉత్తీర్ణులం అయిన తరువాత మే మిద్దరమూ చెరొక దారీ త్రొక్కేము. మణిభద్రుడు మెడికల్ కాలేజీలో చేరేడు. నేను సాహిత్య సంసారంలో అడుగు పెట్టేను. మా పూర్వులేదో కొంచెం వెనకేసి చనిపోయారు కనుక ఈనాఁడు నేను పొట్టకోసం రెక్కలుకొట్టుకో నక్కరలేకపోయింది. ఈలాంటి నిశ్చింతావస్థలో — ఏం చెప్పనూ? — రాత్రిం బగళ్లు కవిత్వం అల్లడంతోటే సరిపోయేది నాకాలం అంతాను.

ఈ వెఱ్ఱి నాకు బాగా తలకెక్కింది. ఏలాగో శ్రమపడి గంటకోపద్యం అల్లడం ప్రారంభించేను. నా రచనా సౌందర్యంచూసి నేనే మురిసిపోయేవాణ్ణి. ఒక్కొక్కప్పుడు నా కవిత్వం తులసీ సూరదాసుల్ని మరపించేది. క్రమక్రమంగా నారచనా భాగాలికి పత్రికలన్నీ తావిచ్చేయి……అంతటితో నాకవిత్వం వెఱ్ఱి కొంచెం మొగంమెత్తింది. కానీ! ఇంత స్వల్ప కాలంలోనే నాపే రింత మారుమ్రోగేసరికి నేనెంత కీర్తిగడించేనో? — అనేగర్వం తలకెక్కింది. అదీ సహజమే అనుకున్నా. గొప్పగొప్పవాళ్లందరికీ టీ పార్టీలిస్తూ ఉండేవాణ్ణి. పూర్వానికి ఇప్పటికీ నాకవిత్వంలో కొంతతేడా కనిపించింది. అది నాచేతి ఆటబొమ్మైంది. అందుచేత ఆటే వ్రాయడం మానుకున్నాను. ఎప్పుడేనా హుసారుపుట్టి ఏదో అల్లుతూ ఉండేవాణ్ణి. ఏ స్వల్పవిషయం వ్రాసినా అందులో రసభావాలు ఊరిపోతూఉండేవి. నా స్థితి ఈలాఉంటే—

అక్కడ మణిభద్రుడు

ఎప్పుడూ ఏచికిత్సాసారసంగ్రహమో, వస్తుగుణదీపికో ముందేసుకుని బుఱ్ఱకొట్టుకుంటూ ఉండేవాడు. ఐదేళ్లు చెమటూర్చిపోసి అసిస్టెంటు సర్జను (Assistant Surgeon) పరీక్ష ప్యాసయి, దుకాణం తెరిచేడు.

పరీక్షా ఫలితాలు పత్రికలలో ప్రకటించినప్పుడు మాత్రం అతని పేరు చూశేను. మళ్లీ ఇంతవరకూ ఎందులోనూ చూడలేదు. నా ప్రశంసమాత్రం ప్రతి రోజూ పత్రికల్లో కొన్ని పేజీలు నిండిపోయేది. అతడా దుకాణంమీద కూర్చుండి రోగులకోసరం ఎదురుచూస్తూ ఉండేవాడు. అతని కేసిచూస్తే గర్వంతో అతణ్ణిచూసి అవహేళనచేస్తున్నా నేమో అని భ్రమపడేవాడు. పోనీ అతడేనా నన్ను పలకరించేవాడా అంటే — అది మొదటికే లేదు.

౨

ఒకనాడు

పన్నెండుగంటలవేళ — తపాలావాడు ఒక కవరు ఉత్తరంతెచ్చి చేతికందిచ్చి వెళ్లేడు. తొందరగా విప్పిచూశేను. అదంతా నాకవిత్వ ప్రశంసతో నిండిపోయింది. దేశసన్మానానికి, దేశగౌరవానికి నేనే పాదర్శకుణ్ణి అని అందులో నిర్ణయించి వ్రాయబడి

ఉంది. అప్పటప్పు డీలాంటి ఉత్తరాలు నాకు వినుగుపుట్టిస్తూ ఉండేవి. పురుషులపక్షంలో ఉపేక్షించినా ఆట్టే బాధుండదుగాని — ఎవరో ఒక యువతీలలామ లేఖిని కురిపించే యీ అమృత వాక్యాల్ని ఉపేక్షించడానికి మనసొప్పింది కాదు. ఈమైనా సామాన్య స్త్రీయేమోఅంటే — దేశాభిమానుడు — సుప్రసిద్ధహృదయనారాయణ జమీందారుగారి సుపుత్రి. విద్యాసంపన్న, బి. ఎ. ప్యాసయింది సావిత్రి. ఈ తరుణంలోనే యీమె ప్రశంస అనేక పత్రికల్లో చూస్తూవచ్చేను. మొదట వాటిని అంతశ్రద్ధగా పాటించలేదుగాని యీవుత్తరం వాటి నన్నింటినీ జ్ఞాపకంచేసింది. వెంటనే కలంపట్టి జవాబువ్రాయడానికి కూర్చున్నాను. కలం నడుస్తూనే ఉంది. మనస్సు ఆలోచిస్తూనేవుంది. నూతనశబ్దాల కోసం నిఘంటువులన్నీ తిరగేశేను. ఇంకా కొన్ని పదాలకోసం క్రొత్తనిఘంటువు వ్రాయవలసిఉంటుందని నిశ్చయించుకున్నాను. ఆ వుత్తరంలో నాప్రతిపత్తిని పూర్తిగా అంగీకరిస్తూ లిఖించడం ప్రారంభించాను.........

......తమరు నన్ను స్తోత్రంచేస్తున్నారు. ఇది తమఘనతనే వెల్లడిస్తుంది. నా రచనలు స్తవనార్హములు కావు. కల్పనా సౌందర్యంలేదు. కవిత్వప్రభావాంగమైన రససిద్ధి మొదలేమున్న...ఇట్టి పరిస్థితుల్లో తమరు నన్ను ప్రశంసించుట తమయాశీస్సంపదను పొందింపచేసిరని తృప్తిచెందుచున్నాను.........." ఈలా...ఈలా...ఉత్తరం పూర్తిచేశేను. తనగొప్పతనాన్ని వెల్లడించుకోవడంలో ఇదికూడా ఒక పద్ధతేగా !!

* * *

నెలరోజులైంది. నా ఉత్తరానికి తిరిగీ సమాధానం వచ్చింది. కాలాతీతానికి కలవరించేను.

"తమరువ్రాసినలేఖ తమసౌభాగ్యతను ద్విగుణీకృతం చేస్తోంది. మేలిమి బంగారానికి తావులు కల్పిస్తోంది. తమను వర్డ్స్‌వర్త్ (Wordsworth) టెనిసనులు (Tennison) సాటిరారని నా తలంపు. తమరచన రసహీనమని వ్రాసియున్నారు. అయితే అవవచ్చును. కాని, అది నన్ను మాయామోహజాలాల్లో నుంచేసే మధురమురళీగానరసాస్వాదనచేయించింది. గంటల కొలదీ రససాగరంలో మునకలేస్తూ ప్రొద్దుపుచ్చుచున్నాను. నిద్రాహారములుకూడ మరచుచున్నాను. తమలేఖిని నొకమారు ముద్దాడుదామా అనే కోరిక లీరికలెత్తుతూవుంది."

ఇది నాకు రెండో ఇంజెక్షను అయింది. ఆఖరు వాక్యం నా హృదయంలో వెట్టపుట్టించింది. హృదయం విడివడి ఉత్తరంలో చిత్రించబడిపోయింది. కవి తనకిష్టమైన పదార్థాన్ని గగన సంచారం చేయిస్తాడు గదా! నేనూ సావిత్రిని భూగగనంలో ఆలోకపాతాళం ముడిపెట్టేశేను.

"కఃత్వం వ్రాసినాడే కవికాదనీ, దాన్నిచదివి అందులో రసాన్ని రచనారహస్యాన్ని హృదయతృప్తిగా అనుభవించేవాళ్లుకూడా కవులే అనీ కార్లైలు వ్రాశేడు. ఈ పద్ధతిలో మీరునూ కవులే. చాలా ఉత్తమోత్తముల నందరినీ చూశేను. ఒకరూ కవిత్వంలో ఉండే మహత్వంమాత్రం అనుభవించినవారు నాకు కనబడలేదు. మీరు రచనాప్రపంచంలో విహార కేళాలన్నీ విమర్శిస్తున్నారు. మీ ఘనత నా కాశ్చర్యజనకం అయింది. తమవంటి సుశిక్షిత మహిళామండలిచే నలంకృతమై భారతమాత ధన్యురాలైంది," అని వ్రాసి ముగించేను.

అనేకనవలలు చదివేను. రసవత్తరమైన కవిత్వాలు చదివేను. కాని సావిత్రి వ్రాసే వుత్తరాల్లో వుండే రసం ఎందులోనూ నాకు దొరకలేదు. అవే తిరిగి తిరిగి చదువుదామా అనే ఆశకలుగుతూ ఉండేది.

3

సావిత్రి మాటలు

తప్పక ఆయన నన్ను ప్రేమిస్తున్నాడు. లేకుంటే

వెంటవెంటనే యీలా వుత్తర ప్రత్యుత్తరాలు జరుపుతాడా? ఈనాడు ఉత్తరంవ్రాస్తే ఎల్లుండే సమాధానం. ఆలోచించిచూస్తే నా ఉత్తరంకోసమే ఆయన ఎదురుచూస్తూ వుంటారా, అనిపిస్తూవుంటుంది. ఆయన కవిత్వంకంటే తఱుచువ్రాసే ఆయన వుత్తరాలే రసవంతంగా ఉంటాయి. చదివిచదివి ముగ్ధురాలనైపోతూఉంటాను. ఒకప్పుడు నేను చిత్రపటం పంపుతున్నానని వ్రాసేను. వెంటనే సమాధానం—ఏమనని? "పటం పంపుతున్నానని వ్రాసినారు. కాని ఇంతవరకూ నాకు చేరలేదు. రిజిస్టరీ చేసివుంటే వెంటనే పంపేది. పోష్టుఆఫీసులో దర్యాప్తుచేస్తాను...." ఈ సమాధానం చూడగానే అదివరలో సుస్తీచేసినా తిరుగుటపాలో చిత్రపటం పంపక తప్పింది కాదు. మూడోనాడు ఆయనఫోటో నాకందింది. ముఖం రాజకుమార లక్షణాలతో విరాజిల్లుతోంది. నా హృదయం చాలావరకు మొదలే లాక్కున్నాడు. ఈ క్షణంలో పూర్తిగా నాహృదయరాజ్యాన్ని ఏలేడు ఆయన. రాత్రులందు నిద్రలేదు. పగలు ఆహారంలేదు. వారి ఆఖరువాక్యం వారి హృదయం నావిహారస్థలం అయిందని ఋజువుచేసింది. "..........ప్రియతమురాలికి..." ఆహా! ముద్దులొలుకుతోంది అనుభావము. ప్రతివర్ణంలోంచి ప్రేమామృతధారలు ఒలుకుతున్నాయి. 'పాతీనిహారకర' అనేరచన నన్నుద్దేశించే వ్రాయబడి ఉంది. మరొకరచనలో ఆయన అవివాహితులని నిర్ణయింపబడిఉంది. కాని నేనుమాత్రం.........." ఆయనింత శ్రమఎందుకు పడుతారు? కవిత్వధోరణిలో శరీరారోగ్యం ఏమరవద్దని వ్రాస్తే ఆయన విషయం తేలిపోతుంది. ఆ అవివాహితుని జీవితపథానికి లక్ష్యంగా నేనే ఏర్పాడ్డానని విశదమయింది.

తిరిగి నేనొకజాబు వ్రాసేను. వెనుకటి వుత్తరాలికీ దీనికి చాలా అంతరువుంది.

"మీ లేఖలలో సంతోషము కలుగుటలేదు. తమ దర్శనమే ప్రాప్తిస్తే సాష్టాంగపడి తమ పదపద్మాల్ని ముద్దుపెట్టుకుందామా అని తటపటిస్తూవున్నాను. నన్నధికంగా జాలిపొందించుట ప్రమాదం. అనుక్షణం తమదివ్య లీలామూర్తిమంతమే నా కళ్ళారాకడుతూ ఉంటుంది. నిద్రావస్థలో మిమ్ములనే పలకిస్తూవుందునంటే అతిశయోక్తికాదు. ఆహారవిహారాల్లో తమ కెట్టిసుకరములు జరుగుచున్నవో? అని తొట్రుపడుతూ వుందును. రాత్రులందు చాలవఱకు నిద్రమేలుకొని ఉండుటలేదు గదా? శరీరారోగ్యం చెడిపోతుంది. ఈ విషయంలో తాము చాలా శ్రద్ధవహించాలి. నన్ను మీపాదదాసిగా ఎంచుకోండి." నాలుగోనాటికల్లా జవాబు. ఎగిరి ఉత్తరం అందుకున్నాను ఆయన నన్ను వివాహం చేసుకుందుకు కుతూహలురై ఉన్నమాట నిజమే కాని కొంచెం ఆశ్చర్యంగా కనబడ్డారు. తలవనితలంపుగా నాకను రెప్పలు మూతలుపడ్డాయి. భావి కార్యక్రమాన్ని తలుచుకుంటూ ఆనందడోలికల్లో ఊగేను.

ఇంతలో మా ప్రభాకరం పటాలదొంతి తెచ్చి నాముందు పెట్టేడు. 'ఈపటాల్లో ఒకదానిని ఏరుకోవలసినది. అందుతో జతపరచిన ఉత్తరముకూడా చదువుకోవలెను! అని బాబుగారి ఆజ్ఞ వినిపించేడు. కట్టువిప్పేను. అందులో నన్ను వరించాలని ఆశించే వ్యక్తుల ఫోటోలున్నాయి. కాని నా హృదయంలో ఒక్కవ్యక్తికే స్థానంఉంది. అన్నీ తిరగేశేను. నా మతానికి సరిపడింది ఒకటీలేదు. వెంటనే నాపెట్టె తీసి వారిఫోటోమీద 'Passed' అనే మాట వ్రాసి తండ్రిగారిదగ్గరికి పంపేను. వారాశ్చర్యపడ్డారు. నేనే లక్షాధికారినో ఎన్నుతా ననుకున్నారు. నేను కవిగారిని వరించడంలోటే వారు నిర్విణ్ణులైపోయారు. కవిగారు ధనాఢ్యులై కుచేలుణ్ణి ధిక్కరించినవారూకారు, భిక్షుకుణ్ణి అనుకరించినవారూకారు. ప్రేమగుడ్డిదని ఎవరు ఎరుగరు? దాని విలువను తెలిసినవారు మాత్రం ఎవరు? నాతండ్రిగార్కి నేనంటే ఎంతో ప్రేమ అందుచేతనే యీ విషయంలో నాకు పూర్ణస్వాతంత్ర్యంయిచ్చి నాతో ఏకీభవించారు.

౪

చివరకి అనుకున్నంతా జరిగింది. వారికి జ్వరం తగలడం ప్రారంభించింది. డాక్టర్లు హృద్రోగమేమో అని సందేహిస్తున్నట్లు తెలియవచ్చింది. నాన్నగారు అహోరాత్రాలు విచారసముద్రంలో మునిగిపోయేరు. నేనీ వివాహం మానితే బాగుండునని వారికి తోచింది. చూస్తూ చూస్తూ నాతిలో ఎవరు దిగుతారు? కాని నాకా లక్ష్యం లేకపోయింది. ఇద్దఱి మనస్సులూ ప్రేమబంధాల్లో కట్టుబడిపోయాయి. వారి రోగమూ బాధా అన్నీ నాకు నాటూ రావలసిందే. నేను వారి దాన్ని. సావిత్రి సత్యవంతుణ్ణి యమపాశాల్లోంచి విడిపించి తెచ్చింది. నేను వీరిని రోగముఖంలోంచి విడిపించలేనా? నేనూ సావిత్రినే గా? ఈ భారత మాత సంతానాన్నే గా? పేరు సార్థక్యం చేసుకో యత్నిస్తాను.

సాయంకాలం అయింది. బాబుగారు క్లబ్బుకు వెళ్ళే వేళ అయినప్పటికి గదిలోనే కూర్చున్నారు. వారు విచారసముద్రంలో మునిగిపోయారు. నేను కూడ ఆయనదగ్గఱ పోయి కూర్చున్నాను.

"బాబూ క్లబ్బుకి వెళ్ళలేదేం?"

"ఏం కావాలి?"

"మీరు అనారోగ్యంగా ఉన్నారా?"

"ఫరవాలేదు."

"మీరు అర్థాకలిగా కూడా తినడంలేదు."

"నాకా సంగతి తెలియును."

"డాక్టరికి ఎవరికేనా చూపించండి. రోగం వృద్ధి పొందించడం బాగుండలేదు."

"నా వైద్యుడు యమధర్మరాజే!"

నాకళ్ళంట నీరుకారడం బాబుగారుచూశారు —

"నా దురదృష్టానికి విచారిస్తున్నాగాని, నీకేమే? సావిత్రీ!" అన్నారు.

నా కేదో పెద్దఅపకారం నాకు వారుచేశారు అనేట్లుగా బాబుగారిని చూసి —

"నా తండ్రిగారైయుండి మీరు నన్ను పూర్తిగా అర్థం చేసుకోలేకపోయారు. మీ ప్రతిమాట విషం పూసినబాణంలా తగులుతోంది. మీ రెప్పుడూ బయటతిరుగుతూ ఉంటారు. నే నింటకూర్చుండి ఎంతగా ఏడుస్తున్నానో మీ కేం తెలుసు? నేను చిన్నదాన్ని. నా నోటివెంట యీలాంటికబుర్లు రానివి కావు. కాని, ఏం చెయ్యను? నా జీవితం సర్వస్వం దోపిడీ చేయబడింది. ఎల్లా ఊరుకోగలనూ? నా భావిజీవితాన్ని అంధకారమయంగా చేస్తున్నారు" అన్నాను.

"సావిత్రీ! చూస్తూ విషం త్రాగమంటే ఎలా? ఆతని రోగం నీ చికిత్సలకి లొంగుతుందని నీకింకా ఆశ ఉందా?"

"తప్పకుండా వారికి ఆరోగ్యం కలుగుతుంది. విస్తారం చదువుతూ, వ్రాస్తూ ఉండటంచేత బహుశః యీ భోజనసదుపాయం సరిగా ఉండకపోవచ్చు. అందుచేతనే ఆలా రుగ్మత కలిగింది గాని స్వతః వారు ఆరోగ్యవంతులే."

ఈ నామాటలు బాబుగార్కి పథ్యం అయాయి. కొంచెం ఆలోచించి — "చెప్పడంలోనూ చెయ్యడంలోనూ సహస్రాంతరం వారుంది. నీవు చెప్పినట్లల్లా అక్షరాలా చెయ్యగలవా?" అన్నారు.

కొంచెం రూక్షస్వరంతో —

"నామాట చేతలోనే పరిణతిపొందుతుంది." అన్నా ధాటీగా.

ఆలా ఆలోచిస్తూ కూర్చున్నవారు చటాలున లేచి బయటికి వెళ్ళిపోయారు బాబుగారు.

వివాహం అయింది.

రోగిష్ఠి అనే సంగతి ఆబద్ధం. వారి దేహారోగ్యం చిత్తానందకరంగా ఉంది. ముఖం ఎఱుపు. నేత్రాలు జ్యోతిర్మయాలు. నన్ను చూడడంతోటే [illegible]మకళ

కలావికసించేది వారిముఖము. అనేక కవులచరిత్ర నేను చదివితే వారివారివిషయాల్లో ఏదో దోషం కనబడుతూనే ఉండేది. కాని వీరికి విషయంలో యీ సిద్ధాంతం నిరాధారం అయింది.

వీరు చాలా బిడియస్వభావులు. పరాయిస్త్రీ కనబడితే తల త్రిప్పరుగరు. నాదెలికత్తె లెవరేనా కనిపించినా సరే లేచి లోపలికి వెళ్ళిపోయేవారు.— 'మీరు పురుషులు. స్త్రీకే పరదా కూడదంటే మీ కాపురమా ఏమండీ?' అని అనేకసార్లు అన్నాను. కాని నాప్రశ్నకి జవాబు అమూల్యమైన ఆయన హాస్యచంద్రికే. వారంటే నాకెంతో నమ్మకం. ఆ హృదయం నిష్కళంక గగనసదృశం అని నావిశ్వాసం. అలాంటివరుడు దొరికినందుకు నా భాగ్యదేవతకి ధన్యవాదాలిచ్చేదాన్ని. సమస్తమూ నాచేతులలోనే వదిలేశేవారు. బట్టలుకూడా నా సలహాలేకుండా మార్చేవారుకారు. వారి ఆహారవిహారాదులన్నీ నేనే చక్కబెట్టవలసివచ్చేది. నా స్థానంలో ఏ యితర నిర్లక్ష్యవ్యక్తైనా యీ సరళహృదయాధికారి అయిందా అంటే యీగృహనిర్వహణ మెట్లా పరిణమించేదా?' అని ఆశ్చర్యం వేసేది. వారికి తమ ఆఫీసుగది పరిశుభ్రతేనా అక్కరలేదు. వేలుమడిచి చూపినదాకా ఎక్కడదుమ్ము అక్కడేనిలవ. కాలిమీద కాలేసుకుని కూర్చోవడమే. నెలకినాలుగురోజులు ఇల్లంతా పురుగులుకొట్లాడుతూ ఉండేవి.

“ఏమండీ! భారతదేశం అంతా మీ కవిత్వం ప్రశంసే కదా? మీ సోమరితనం, నిర్లక్ష్యతా ఎవరేనా ఎరుగుదురా?” అని అడిగేను.

“నీవో వ్యాసం వ్రాసి పంపకపోయేవా?” అని నవ్వేరు.

“అపకీర్తి కలుగుతుందేమో?!”

“అందులో నీకూ భాగం వుంటుందిగా?”

“నాకేం! ఇంతనిర్లక్ష్యం అయితే ఏలా?”

“నీవు నాయింటికి రాణివిగా?”

“నేను రాణీనే. అందుకే చెపుతున్నా. తమరు తమఆఫీసు చక్కచేసుకోండి.”

“నీవు సూపరింటెండెంటు (Superintendent) అని తలుస్తున్నాను.”

నేను కోపగించి వెళ్ళిపోయేను. కాని మనసు మనస్సులో ఆనందతరంగాలు పొంగిపొర్లుతున్నాయి. మర్నాడు వారి ఆఫీసుగదిదగ్గరకి వెళ్ళేను. గోడమీద బయట —

సావిత్రి, బి. ఎ.

(Savitri. B. A.)

సూపరింటెండెంటు.

(Superintendent)

అనే బోర్డు వ్రేలాడగట్టి ఉంది. దాన్ని లాగి వారిదగ్గరకి విసరేసి, 'యీ దండగాలు చూస్తే లోకు లేమంటారు?' అన్నాను. వారు మందహాసంతో చేతులుచాపేరు. ఆహో! చంద్రికాకిరణజాలాల్లో తల్లీనతచెంది అప్రయత్నంగా వారి కరకమలపాశాల్లో బంధింపబడ్డాను.

సాయంకాలం అయింది. నా విలువదుస్తులు ధరించి 'కొంచెం షికారువెళదాం రండి' అని పిలిచేను.

వారు ఏదో రచనానిమగ్నులైఉన్నారు. 'ఉత్తమ భావాలు తోస్తున్నై. వాటిని ప్రకటించడానికి శబ్దాలు వెతుకుతున్నాను. ఇది సమయంకాదు. మాట్లాడించకు.' అన్నారు. నాకు విసుగు తలకెక్కినట్లైంది! ఏటి ఎల్లకాలం వారిపనేదో అదేగాని నా బ్రతుక్కి స్వాచ్ఛందితలేదా?' అని తోచింది. మొదటి రోజుల్లోకంటే ఇప్పుడు నేనంటే విముఖులయారా? అనిపించింది. 'హృదయం ప్రేమశూన్యమా' అని

సందేహంకలిగింది. ఆ కవితాధోరణి నా కంత రుచించిందికాదు.

"మీ కవితాధోరణే మీదా? ఏమైనా సంసార సుఖం కావాలా?" అని నిర్మొగమాటంగా అడిగేశాను.

"కవిత్వంవల్ల ప్రపంచంలో ఆందోళన బయలుదేరుతుంది."

"నాదృష్టి ఏమైనా ఉందా? లేదా?"

"అది నీమనస్సునే అడుగు."

"నా హృదయాన్ని కాదు, మిమ్మల్నే అడుగుతున్నా. కొంచెం నావైపు తలెత్తి జవాబుయిస్తురూ."

"ఈ రచనచూస్తే నీవు ఉప్పొంగిపోతావు. ఇదివరలో యిలాంటి రచన ఎప్పుడూ వ్రాయలేదు."

"నాకీవేళ కొంచెం షికారుచేసి వత్తామని కోరిక కలిగింది. ఈ కవిత్వం నా ఆశని చెడకొట్టేటింది. కాగితం లాగేసి, సిరాబోర్లింతామా అని ఊహకలుగుతోంది." అన్నా దీనంగా.

"కాగితం సిరాలకేంగాని ఈభావాలు మళ్లీరావు. ఈవేళకి నీ వొక్కర్తవూ వెళ్లి వస్తూ!"

"నా మనస్సు అంగీకరించడంలేదు."

వారు చెయ్యిచూపి తిరిగి వ్రాసుకోడం మొదలు పెట్టేరు. నా హృదయంలో బల్లెలు పొడిచినట్లైంది. వారికి కవిత్వధ్యానమేగాని నాధోరణేలేదు. పేరు కోసం చూస్తారుగాని యింట్లో ప్రేమచూడరు.

గదిలోంచి బయటికొచ్చేను. తిరుగుతూతిరుగుతూ ఒకవంతెనమీదికి వెళ్లేను. మనస్సు బరువైపోయింది. జగత్తు శూన్యమై కనిపించింది. నా తండ్రిమాటలు జ్ఞప్తికివచ్చేయి. నా దురదృష్టాన్ని నిందిస్తూ, విచారిస్తూ ఎంతసేపు కూర్చున్నానో నాకేమీ బోధపడలేదు. నా వివాహానంతరం నా సుఖదుఃఖములను నాతో పంచుకొనేవారు కవిఅయేరు, కాని నాదుస్థితి చూచి జాలినొందేవ్యక్తి ఇప్పుడు నా కొక్కరూ లేరు. నా జీవనౌక నదిలో కొట్టుకుపోతోందా అనిపించింది. కన్నీళ్లతో నిండిన ఆ నిర్భరదృష్టిజాలాల్లోంచే వారు వస్తున్నారేమోనని పదేపదే చూచేదాన్ని. ప్రేమ ఆశనుత్యజించగలదా?

నాదృష్టి నదివైపుమళ్లింది. ఏదో మంత్రశక్తి న నన్నానదీతరంగాల్లో లాక్కొని పోతోందా అనిపించింది. హఠాత్తుగా నిద్రాదేవి నన్నాదరించింది. నదీమాత తన ఒడిని నా కాశ్రయంయిచ్చింది. నేను నదీప్రవాహంలో కొట్టుకుపోతున్నాను.

* * *

తెలివొచ్చింది. నేను ఇంటిదగ్గర ఉన్నాను. వారు ఎదురుగా నిలబడిఉన్నారు. కుర్చీలో డాక్టరుగారున్నారు.

"వీరు నా స్నేహితులు. మణిభద్రుడు. నదిలో దూకి నిన్ను బయటికి తీయకుంటే యీపాటికి నీ వెక్కడదానవో కదా! వీరికి ధన్యవాదాలియ్యి" అన్నారు వారు.

నెమ్మదిగా లేచి బట్ట సవరించుకొని డాక్టరుగారివైపు చూచాను. కాని వారిముఖం చూడలేకపోయాను. "భగవానుడు మీకు మంగళముచేకూర్చుగాక" అని కూర్చున్నాను. నా హృదయావేదన ఎక్కువైంది. వా రక్కడనుంచివెళ్లిపోతే బాగుండేదే అనిపించింది. వారు లేచి వెళ్లినతర్వాతమాత్రం నా మనోవ్యాకులత యినుమడించింది. నీటిషికారువెళ్ల నిప్పుకొనితెచ్చినట్లైంది. ఏంచేసేది?—

మణిభద్రుని మాటలు

రాత్రి పన్నెండైంది. కాని నాకు నిద్రపట్టడం లేదు. సావిత్రికళ్లు నా చిత్తాన్ని దొంగిలించేయి. ఆహా! ఆకంటిశోభ, ఆ చూపులకంటే అధికార్ల తగిలించే సంకెళ్లు సులువు. లేలికగా ఒదిలించుకోవచ్చు. ఆమె నేత్రాలు మాటిమాటికి నన్నేచూస్తూవుండాలని

కోలేవి. కాని ఆమె కనురెప్పలను లేవనిచ్చిందికాదు. సరాయి పిల్లవాడిచేతిలోనున్న ఆటవస్తువులా నిలిచి పోయేను. ఆమె చూపుపాశాల్లో ఎదురుగా సత్యవం తుడు నిలబడిపోయాడు కాని లేకుంటే మనసార ప్రేమావలోకనాలు విజృంభించేవే!

మర్నాడు షాపులోకి వెళుతూ ఆమెను గుమ్మంలో నిలబడిఉండగా చూచేను. సతృష్ణదృష్టులతో ఆమె నన్ను చూచి ఒకనవ్వు నవ్వింది. ఆ చిరునవ్వులో మెరుపుమెరిసింది. నాహృదయం కరిగిపోయింది. షాపులో నా మనసుండబట్టలేదు. ఎప్పుడు సాయం కాలమగునా అని నిరీక్షించేను. నిముషాలు లెక్కిస్తూ కూర్చుంటే సాయంత్రమయింది. షాపుమూసి మెల్లగా యింటికి మళ్లేను. నాకేదో అద్భుతవస్తువు ప్రాప్తిస్తుం దని ఉద్విగ్నూ లేను. సత్యవంతుని గుమ్మందగ్గర అప్రయత్నంగా నా నడక ఆగిపోయింది. చూపు గుమ్మంలోకిసాగింది. సరిగా ఆమె ద్వారబంధాన్నాని నిలబడింది. నోటివెంట మాట వెలువడలేదు. కాని చూపులుమాత్రం ఆమెహృదయాన్ని విప్పిచూపేయి. ఆ కళ్లల్లోది ప్రేమో మరొకటో ఎరగంగాని ఒక అలౌకిక ప్రతిభమాత్రం తప్పకుండా వెలిగింది. మతి పోయినవాడిలా యింటికిచేరేను.

చాలారోజులు గడిచేయి

దృశ్యాత్రాలు మరికాస్త పురిపెట్టబడ్డాయి. ఆమెను చూడకుండా మనసుండబట్టలేదు. మంచు నీటితో మనుష్యుని దప్పిక తీరుతుందా? ఆశ ముందుకు సాగిపోతోంది విరామంలేకుండా. ఆపత్కాలంలో ఎఱ్ఱజండా చూపించినట్లు మనస్సు సావధానత పరు స్తోంది. త్రాగిన సారథిలాగు మన్మథుడు నిర్లక్ష్యం ప్రకటిస్తున్నాడు. ఇతని పానీయం మామూలుమత్తు పదార్థం మాత్రంకాదు. ధర్మకర్మకుసుమాల్ని అగ్ని హోత్రాహుతిచేసే భీతాహంతనే దేవతనోట్లో పడిశే సుందపానీయం. దీన్నే విషయవాసనాపర్బత్తంటారు.

ఒకనాడు చాలారాత్రి అయి వారింటికి వెళ్లేను. ఏదో గొప్పకష్టం కలిగినట్లు మనస్సు వ్యాకులత చెందుతోంది. కార్యక్రమంఅంతా పూర్తైంది. గుమ్మంలో సావిత్రి నిలబడిఉంది.

“ఈవేళ చాలా ఆలస్యమైందే?” అందామె. ధ్వని భిన్నించి గద్గదావస్థను పొందింది. నాహృదయం కలిగిపోయింది. శరీరమంతా చెమటలు కమ్మేయి. నా విద్యార్థి అవస్థలో వందలకొలది శవాలనికోశేను. అప్పుడేనా నాకేలా ఉండేదికాదు. ప్రతి అవయవం వణకసాగింది. కొంచెం స్థాయిపడి —

“జానండీ! ఓ పేషెంటు (Patient) ను చూడ్డా నికి వెళ్లేను. మీరిక్కడే నిలబడ్డారేల? ఎవరికోసం?”

“వారింకా యింటికిరాలేదు. అందుకేచూస్తున్నా వస్తున్నారేమో అని.”

“ఎక్కడేనా కవిసమ్మేళనం జరుగుతోందా?”

“అవ్వే, కవిలేదు సమ్మేళనంలేదు. ఎక్కడో ఉత్సవంలో వారి నూతనరచనలన్నీ వినిపించాలట”—

“ఆలాగైతే పన్నెండుగంటలైతేనే గాని రారేమో?”

దీర్ఘనిశ్వాసాన్నివదలి చిరునవ్వుతో నాకేసి చూస్తూ—

“ఇంట్లో నాకేంతోచడంలేదు.” అంది.

“ఇప్పుడు ఎనిమిదేగా! అవుతా!”

“గడియారపుముల్లు తిప్పేదామా అనిపిస్తోంది.”

నాకాళ్లాడడంలేదు. ఏదో క్రొత్తనాటకం జరుగు తూన్నట్లైంది. ఎవరైనా చూస్తారేమోఅని పాగవలసి వచ్చింది. ధర్మభీతి ఉన్నా లేకపోయినా లోకభీతి తప్పకుండా ఉంటుందిమాకు. ‘ఏం! ఇంకా తెలిసికో లేదా నీవు’ అన్నట్టుగా చూసింది సావిత్రి. విధిలేక మెల్లగా యింటికిజేరేను. సావిత్రీ విగ్రహమేనా

కళ్ల ముందు ప్రతిఫలిస్తోంది. ఆమె మధురవాక్కులు నా చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. నేనామెని మరచిపోవాలని యత్నించే ఈ కార్యంలో నేను నిందాపాత్రుణ్ణి అవుతానని భయం వేసింది. నాకేసి వేలు ముడుస్తారనే దడదడ కలిగింది. లోకులు నన్ను ఉత్తముడని వ్యవహరిస్తున్నారు. ఈ వాసన నా సర్వనాశనకరమని నాకు తట్టింది. లోకులు నిర్ఘృణులౌతారు. ఇంతదుర్మార్గు డుండబోడంటారు. ఆమె వివాహిత ఆమెకై వేచాచుట అనుచితం. కాని ఏంచేసేది? ఈ ఊసులు, ఈ ఆలోచనలూ బలతరంగా లయిపోయాయి. ఎంత వేగంగా ఎంత ఉన్నతంగా తరంగం వేస్తుందో అంతత్వరలో అంతకంటే లోతుగా పతనమౌతుంది. ఒక చిన్న వాయుప్రసారణ వాటిని రూపుమాపుతుంది. మానవు డెంతటిబలహీనుడు! ఎంత అస్వతంత్రుడు!

మలిరోజున నేను సత్యవంతుని భవనంలో ప్రవేశించేను. కాని నాకాలు ఊరి అడుగుపడుటలేదు' దొంగతనానికి ఇంట్లో ప్రవేశించలేదే కన్నగాడిలా తటపటాయించేను. ముందొకటి వెనుకకు రెండంజలుగా ఊగులాడేను. చొరవచేసి లోపల ప్రవేశించేను.

అతడు నన్ను చూడగానే ఆదరించి సత్కరించేడు. చాలా సేపు సంభాషణ నడిచింది. సావిత్రికూడా సమీపంలోనే కూర్చుంది. నాదృష్టి ఆమెముఖవర్చస్సుతో ముద్దులాడుతోంది. మొదట దొంగతనం, తరువాత కన్నగాడితనం, పిమ్మట దోపిడి. ఈలా మారింది కథ. ఆమెకూడా సిగ్గువదలి మాటిమాటికి నవ్వసాగించింది. ఇప్పుడామె నాకేసి చూడడంలో సంకోచంలేదు. చపలత్వం లజ్జాభావాన్ని అతిక్రమించింది. ఇంద్రత్వం లభించినట్లుగా సంతోషిస్తూ యింటికి వెళ్లిపోయేను. కాని బాహ్యప్రపంచం అంతా శూన్యంగా కనబడింది. అక్కడనుంచి రోజూ రాత్రులు రెండుగంటలు ఆమెతో కూర్చుని మాట్లాడుతూ ఉండేవాణ్ణి.

క్రమంగా మనస్సు లొకటయాయి పాపం! సత్యవంతు డింతేనా ఎరగడు. కల్పనా సముద్రంలోంచి ఆలోచనా ముత్యాలని బయటికితీసే ఆకవి, —'కలి గానని చోరవి గానని నేర్చునే, అనే ఆదూరదర్శికుడగు ఆ కవి; — విద్వచ్ఛిరోమణి అనబడే ఆకవి — నేడు ప్రత్యక్షంగా — తనకళ్లెదురుగా జరిగే ఘోరసంగ్రామతుముల రంగాన్ని — యీ నటనా సూత్రధారుని విదూషక ఘట్టాన్ని — చూడలేక పోతున్నాడు. అతనికవిత్వం జడపదార్థాల్ని సైతం తాడనం ఆడిస్తుంది. కానీ తానింకా నిద్రావస్థలోనే ఉన్నాడు. ఈ అజ్ఞానసంసార పారావారయాత్రికుడు ప్రకృతిసౌందర్య ముగ్ధుడై కలుకుతున్నాడు, గాని, తన నావ చట్రాతికి ఢీకొంటోందని తెలియజాలకపోయాడు. అతడు తన పతనానికి తానే హేతువైనాడు.

సావిత్రి మాటలు

ఎంతేనా అంతరువుంది. మణిభద్రుడెక్కడ? మీరెక్కడ? ఆ విశాలనేత్రాలు జ్యోతిర్మయ తారకలు. అదేమోగాని మణిభద్రునిచూడకుండా క్షణమేనా నాకు ఉండబట్టడంలేదు. అయస్కాంతాన్ని చేరే యినుములా అయిపోయింది నామనసు. మాటలు మాణిక్యాలమూటలు. హృదయం విప్పి మాట్లాడే స్వభావం. వారు లేనప్పుడు ఇల్లువిడచి మణిభద్రుని గదిలో వాలుదామా అనిపించేది. మా జీవితపథంలో క్రొత్తవిధానం ఏర్పడిందని ఆడావాడ విస్తరించి పోయింది. నన్నుచూస్తే వింతహాస్యాలతో వాడ స్త్రీలంతా గుసగుసలాడేవారు. కవిగారుమాత్రం మూర్ఖులా? అయితే వారు నిర్లక్ష్యంగా ప్రవర్తించేవారు. తెలియని వారుమాత్రం కారు. చేతులునలుపుతూ పశ్చాత్తాపపడుతూ ఉన్నట్లుగా నాకు తెలుసు. ఇల్లువాకిలి అక్కరలేకుండా సంసారం నెట్టుతూన్నారని విశదంఅయింది. రాత్రులు నిద్రలేదు. పగలు ఆహారం లేదు. ముఖంకళ కాంతులు లేకుండా వన్నెతరిగింది.

ఒక్కొక్కనాడు స్నానంకూడా మరచిఉండేవారు. నాకూ వారంటే ఇప్పుడంత శ్రద్ధలేదు. నిశ్చింతగా ప్రతివిషయం వదిలేసి కూర్చుంటున్నాను. వారి ఉదాసీనభావంచూస్తే 'చెఱపకురా చెడేవు. చేసుకున్న వారికి చేసుకున్నంత' ఈలాంటి లోకోక్తులు తలంపుకు వచ్చేవి. ఒకనాడు ప్రయాగ మాసికపత్రికలో వారిపద్యమాల ప్రకటింపబడింది. దాని మొదటి పదం యిది—

కోరనివారిని గూడజూచెదవు,
కొఱతతీరునే మనసా

ఇందులో వారి అనుభవచిత్రణమే వర్ణింపబడి ఉంది. నాకు అరికాలుమంట నెత్తికెక్కింది. తిన్నగా వారిదగ్గరకి వెళ్లి—'ఇదేంకవిత్వం?' అని యీసడింపుగా ప్రశ్నించేను. వారు నావైపు చూసేరు. ఆ చూపులు ద్రవీభూతమైనాయి. రాతినికూడా కరిగించే మార్దవం ఒలుకుతోంది. మెల్లగా 'ఏంటిటీ?' అన్నారు.

"ఇది చదివి లోకులు ఏమంటారు?"

"కవి తానుచూచిందీ, అనుభవించిందీ, వ్రాసి పారేస్తాడు. వాతప్పేముంది?"

"..........మీరేంచూశేరు?—"

"సావిత్రీ నన్ను వాగించకు, నీకొంగుచాటు ముఖమంచుకొని సింహావలోకనంచెయ్యి. నాదగ్గర ఏదీ దాగలేదు."

"ఎందుకునన్ను నిందించడం?"

"నిందే అయితే ఈపనికంటే నూరురెట్లు మెఱుగు."

"అయితే నన్నవమానిస్తున్నారన్నమాట"

"అవమానమైతే ఏడ్వేందుకు? ఇప్పుడు పూర్తిగా విశ్వాసమే కలిగింది. చెవులుమోసపోతే కళ్లు గ్రుడ్డివి కాలేదు. నాఇల్లు—ఈలా రాజసత్రం అవుతుందని కల్లోకూడా అనుకోలేదు."

నేను నిలువునా నీరైపోయాను దురాచారాలకి నిర్లజ్జత పురోగామి అయింది. వినుగుదలతోఁ మీరు పద్యాలు వ్రాయండీ ఇతరులగతి ఏమైతే మీకేం?'

"చేతేతా మృత్యువునుకోరి తెచ్చుకోకు. నేను నిజంగా పిచ్చివాణ్ణైపోయాను." అని గర్జించేరు.

"అయితే! చంపుతారా?—కానివ్వండీ! మీ మనోవాంఛ తీరుతుంది."

సింహం వేటాడబోయే హరిణాన్నిచూచేట్టుగా నన్నుచూచి అలమరావైపు పరుగెత్తేరు. నాగుండె కొట్టుకోసాగింది. నేను బయటికి పారిపోయివచ్చేను. వారు నన్ను వెంటాడిస్తారేమో అని భయంవేసింది. మైదానంలోవచ్చి నిలబడ్డాను. నామనస్సు వికసించింది. మృత్యువును నిరీక్షిస్తున్నాను. కాని వారు బయటికి రాలేదు. మరికొంతసేపటికి 'ధాం' అనే శబ్దం గుండెలు బ్రద్దలుచేసింది. లోపలికి పరుగెత్తి చూసేను. వారు క్రిందపడి కొట్టుకుంటున్నారు. మరణావస్థలో ఉన్నారు. భయపడిపోయేను. కాని నాకింతేనా విచారం కలుగలేదు. అయితే! ఏ పోలీసుల అధీనమైనాఅయి వ్యవహారాల్లో మునిగిపోనుకదా! అనే భయం నన్ను బాధించింది.

రెండుమాసాలు గడిచేయి.

మణిభద్రునికోసం నెక్ టై (Neck—tie) కడుతూ కూర్చున్నాను. లోకాచారాల్ని లెక్కపెట్టకుండా అతనితో వివాహంచేసుకుందామనే సంకల్పంతో ఉన్నాను. లోకులు ఈ నా అభిప్రాయానికి చకితులైపోయారు. ఏమైతేనేం. వారు గతించినందుకు చాలా సంతసిస్తూ కూర్చున్నాను. నా జీవితానందం ఇప్పుడు కలుగుతుందికదా అని గాలిమేడలు కడుతున్నాను. నౌకరు టపాతెచ్చి ముందుబెట్టేడు.

అందులో ముందుగా ఒక పేకట్టు నన్నాకర్షించింది. విప్పిచూచేను. అది నా మృతపతిరచనా సంగ్రహం. అందులో ఒకటి రెండు భాగాలు చదివేను. హృదయావేదన ఎక్కువైంది. ఆ భావాలు ఉన్నతాలు పవిత్రతమాలు, సంసారమాలిన్య రహితాలు. వీటిలో కపటంలేదు వంచనలేదు. ఇందులో ఆముష్మికసుఖం, శాన్తి కొల్లలు కొల్లలుగా ద్రవిస్తున్నాయి. నాకన్నీరు ధారలుగా ప్రవహిస్తోంది. అకస్మికంగా మూడవపేజీ మీదకి నాదృష్టి దొర్లింది. ఇది అంకితం యివ్వబడ్డ పేజీ, నాగుండె రాయిఅయిపోయింది. రక్తప్రసారణ ఆగిపోయే కూడాఉంటుంది. అది నాకే అంకితం ఇవ్వబడిఉంది. ప్రతిపదమూ ప్రేమామృతం వర్షిస్తూవుంది. ఆ ప్రేమకీ మణిభద్రుని ప్రేమకూ పోలికేలేదు. హస్తిమశకాంతరం. అది అమృతకిరణస్పర్శ; ఇది దవానలస్పర్శ; అది పారావార గంభీరం; ఇది పర్వతో పత్యక ప్రవితశీఘ్రగామి ఐన ఝరి; అది సత్యనూక్తి కాని శబ్దరహితం; ఇది అనృతవాదం కాని మేఘ గంభీరఘోషణ.

నాకళ్లకి కప్పినపొర అకస్మాత్తుగా విడిపోయింది. పతీత్వము నే ఉన్నతస్థానాన్నుంచిఏపాతాళలోకంలోకి పడిపోతున్నానో నాకు గోచరించింది. పుస్తకం కళ్లని అద్దుకుని విచారించేను.

ఇంతలో మణిభద్రుఁడు లోపలికివచ్చేరు. భావి కళ్యాణానంద కల్పనలో మొఖం ఎఱ్ఱబారింది. ఆయన చేతులో అమూల్యదామం ప్రకాశిస్తోంది. అది నాకోసం బొంబాయినుంచి తెప్పించేరు. నాఏడుపు, విన్నతనంచూచి నిలువునా నీరైపోయి—

"ఏడుస్తున్నావేఁ?" అని అడిగేరు.

"ఇప్పుడు నాకళ్లు తెఱిచేయి."

"ఇదిగోహారం. రేపు వివాహం!"

"ఇప్పుడిక వివాహం కాజాలదు."

"సావిత్రీ! పిచ్చిదానవైపోతూవున్నావా ?"

"పరమాత్ముడు నన్ని పిచ్చిలోనే సర్వదా ఉంచుగాక !"

మణిభద్రుఁడు ముందుకుసాగి నన్ను స్పృశించబోయారు. నేను లేచి వెనక్కి వెళ్లిపోయాను. దూరంగా ద్వారము కేసి వేలుచూపుతూ—'అటుపో! ముందుకి ఒక అడుగేనా పెట్ట వీలులేదు' అన్నాను.

ఆరాత్రి నాకు సుఖనిద్ర కలిగింది. ఆలాటినిద్ర నాజన్మకాలంలో ఇదివర కెన్నడూ నేను అనుభవించి ఉండలేదు. నేను నాభర్తని తృణీకరించ కలిగేను. కాని వారిప్రేమను కాదనడానికి నాశక్తికి మీరిన కార్యం అయింది. మానవుడు నశ్వరశరీరుడా? మానవుడు మరణించినా ప్రేమమాత్రం అమరత్వసిద్ధినే పొందుతుంది.

(శ్రీమాన్ సుదర్శనకవిగారి కథకు స్వేచ్ఛానువాదం)

స్త్రీప్రేమచే సుశిక్షితుడుగాక యామె ధైర్యముచేబలవంతుడుగాక, యామెవివేకముచే నుపదేశికుడుగాక యే పురుషుడును సక్రమజీవితమును గడిపి యుండలేదు.

'రస్కిన్' —